
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 ; కనిష్ఠం 23.5
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 28 మే 2025





- జూన్‌లో ఒకేసారి మూడు నెలల రేషన్
- మూడు విడతలుగా పంపిణీకి సన్నద్ధం
- ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం తరలింపు
- జిల్లాలో 2.53 లక్షల రేషన్‌కార్డులు.. 578 రేషన్ దుకాణాలు
- ప్రతీనెల 4,700 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్న పౌర సరఫరాల శాఖ
- మూడు నెలలకు 14 వేల మెట్రిక్ టన్నులు బియ్యం అవసరం
- ప్రస్తుతం 20 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం స్టాక్

ముందుగానే..

మూడు నెలల కోటా!

కామారెడ్డి, మే 27(ఆంధ్రజ్యోతి): వర్షకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జూన్‌లో మూడు విడతలుగా బియ్యం పంపిణీకి జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఎంఎల్ఎస్ గోదాంల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యాన్ని సరఫరా చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేద ప్రజలకు సన్న బియ్యాన్ని గత రెండు నెలల నుంచి సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర ప్రభుత్వం సైతం మూడు నెలల కోటాకు సంబంధించి రేషన్ బియ్యాన్ని జూన్‌లోనే ఇవ్వాలని ఆదేశించింది. ఇప్పటికే జిల్లాలో సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల వరకు రేషన్ బియ్యం స్టాక్ ఉన్నట్లు సంబంధితశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 2.53 లక్షల రేషన్ కార్డులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో మొత్తం 578 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,53,293 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 2,34,730 ఉండగా అంత్యోదయ ఆహార భద్రత కార్డులు 17,664, అన్నపూర్ణ కార్డులు 901 ఉన్నాయి. ఈ కార్డులకు గాను ప్రతీనెల 4700ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌర సరఫరాలశాఖ లబ్ధిదారులకు పంపిణీ చేస్తోంది. ఆహార భద్రత కింద ఒక్కో వ్యక్తికి 6 కిలోల బియ్యం, అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుదారులకు 10కిలోల చొప్పున సరఫరా చేస్తున్నారు. ప్రతీనెల 1 నుంచి 15వ తేది వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది.

14 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం

జిల్లా పరిధిలో 578 రేషన్ దుకాణాలు ఉండగా మొత్తం 2,53,293 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరికి మూడు నెలల కోటాకు సంబంధించి 14,100 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ కష్టతరమైనా సాఫీగా వినియోగదారులకు అందించేందుకు పౌర సరఫరాల అధికారులు సన్నద్ధం అవుతున్నారు. మే నెలకు సంబంధించిన బియ్యం పంపిణీ పూర్తయింది. జూన్ నెలలో పంపిణీ చేయాల్సిన మూడు నెలల బియ్యం నిల్వలు రేషన్ దుకాణాలకు సరఫరా విషయమై దృష్టి సారించారు. జూన్ 10వ తేదీలోగా ఒకనెల కోట, 20లోగా రెండో నెల, నెలాఖరులోగా మూడో నెల కోటా బియ్యం రేషన్ దుకాణాలకు చేరేవిధంగా కసరత్తు చేస్తున్నారు. రేషన్ దుకాణాలకు మూడు విడతలుగా బియ్యం సరఫరా చేస్తే వినియోగదారులు ఎప్పటికప్పుడు వాటిని తీసుకెళ్తారని దీంతో సమస్య తలెత్తదని అధికారులు భావిస్తున్నారు. ఒకేసారి మూడు నెలల కోటా దుకాణాలకు పంపితే సమస్య ఎదురవుతాయని రేషన్ దుకాణాల్లో తగినంత స్థలం ఉండదని తక్కువ సమయంలో అన్ని రేషన్ దుకాణాలకు సరఫరా చేయడానికి ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు చెబుతున్నారు.

ఒక్కొక్కరికి 18 కిలోల చొప్పున

మూడు నెలల కోటా అనగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి రేషన్ బియ్యం వచ్చే నెలాఖరులోగా వినియోగదారులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున మూడు నెలలకు 18 కిలోలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు గాను వినియోగదారులు సహకరించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే ఎంఎల్ఎస్ గోదాంల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తున్నారు. జిల్లా పరిధిలో కోటాకు సంబంధించి సరిపోయే బియ్యం నిల్వలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

20 వేల మెట్రిక్ టన్నుల వరకు బియ్యం నిల్వలు

వానకాలం, యాసంగి సీజన్‌లలో రైతుల నుంచి ప్రభుత్వం దొడ్డు, సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు కేటాయించి సీఎంఆర్ కింద తిరిగి పౌర సరఫరాల శాఖ బియ్యాన్ని సేకరిస్తోంది. ఇదే బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల వరకు సన్న బియ్యం ఉన్నట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. ప్రతీనెల జిల్లాలో రేషన్ కార్డుదారులకు 4,700ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న బియ్యం నిల్వల ప్రకారం ఐదు నెలల వరకు కార్డు దారులకు పంపిణీ చేయవచ్చు. ఇదిలా ఉండగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం, సంక్షేమ హాస్టల్‌లకు సుమారు 600 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది.



హరీష్‌రావుకు స్వాగతం పలుకుతున్న ఆలయ పూజారులు (ఇన్‌సెట్‌లో) ఆలయంలో పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కాలభైరవ స్వామి ఆలయంలో

ఎమ్మెల్యే హరీష్‌రావు ప్రత్యేక పూజలు

ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం చేస్తానని హరీష్‌రావు హామీ

రామారెడ్డి, మే 27 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో వేద పండితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్ఛారణలతో సంతతధారాభిశేకం, క్షీరాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం భైరవ.. ఓంఓం భైరవ.. శ్రీ భైరవ.. శ్రీ కాలభైరవ స్వామి నమో నమః అంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు ఆలయ అభివృద్ధికి సహకారం చేస్తానని హామీ ఇచ్చారు. కాగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బుర్ర ప్రభురాంచంద్రం గుప్తా, రామారెడ్డి మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు, గాంధారి నేతలు సత్యం రావు, శ్రీ కాలభైరవ స్వామి ఆలయం ఆవరణలో ఆర్య వైశ్య సత్రం గంజి సతీష్ గుప్తా, బీఆర్ఎస్ నాయకులు కాసర్ల రాజేందర్, పడిగెల శ్రీనివాస్ గుప్తా, ల్యాగల మహిపాల్, బండి శ్రీనివాస్, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



డీఈవో రాజుకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

జీవ, భౌతిక శాస్త్రాలను విభజించాలి

కామారెడ్డి టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): జీవశాస్త్ర, భౌతిక శాస్త్రాలను వేర్వేరుగా విభజించి వంద మార్కులకు పెంచాలని తెలంగాణ బయో సైన్స్ ఫోరమ్ తరపున ఉపాధ్యాయులు డీఈవో రాజుకు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6, 7వ తరగతి పాఠ్యంశాలను జీవశాస్త్రం, భౌతికశాస్త్రపరంగా విభజించాలని, పదో తరగతి వరకు జీవశాస్త్ర మార్కులను వంద మార్కులకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హన్మంత్‌రెడ్డి, కుంట రాములు, పంపరి ప్రవీణ్, అంబీర్ మనోహర్, రాజేశ్వర్, బాపురెడ్డి, రమణ, పవన్, సత్యనారాయణ, శేఖర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డికి యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ మంజూరు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ. 200కోట్లతో స్కూల్ నిర్మాణం

కామారెడ్డి, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎల్లారెడ్డి నియెజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్‌ను మంగళవారం మంజూరు చేసింది. స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు సైతం నిధులు కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 20 నియోజకవర్గాలకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్‌ను మంజూరు చేయగా ఇందులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి బాన్సువాడ నియోజకవర్గానికి, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మంజూరయ్యాయి. గతంలోనే జుక్కల్ నియెజకర్గానికి సైతం స్కూల్‌ను మంజూరు చేసింది. నియోజకవర్గంలోని మద్నూర్ మండల కేంద్రంలో స్కూల్ భవనాల నిర్మాణానికి స్థలాన్ని గుర్తించడంతో పాటు ప్రజాప్రతినిధులు శంకుస్థాపన కూడా చేశారు. రెండవ విడత కింద ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పట్టుబట్టి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయించారని కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ విద్య

ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ప్రభుత్వం మంజూరు చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో 2500 మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా బోధన అందే అవకాశం ఉంది. నాలుగవ తరగతి నుంచి ఇంటర్ వరకు రెసిడెన్షియల్‌లో చదువుకోనున్నారు. అత్యాధునిక టెక్నాలజీతో కంప్యూటర్ ల్యాబ్‌లు అన్ని తరగతి గదుల్లో డిజిటల్ బోధనలు చేయనున్నారు. వసతి గృహాలు, పాఠశాల భవనాలు అన్ని కలిపి ఒకే దగ్గర కేటాయించానున్నారు.

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2న స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించాలని, జిల్లాలో ప్రభుత్వ శాఖలు చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్య అతిథి సందేశం సిద్ధం చేయాలని తెలిపారు. అమరవీరుల స్థూపంను శుభ్రపరిచి ముస్తాబు చేయాలని తెలిపారు. డయాస్, టెంట్లు, విద్యుత్, కుర్చీలు, మైక్ తదితర ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మున్సిపల్‌శాఖ ద్వారా శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టే సంక్షేమశాఖల అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ముఖ్యఅతిథి సందేశం తయారు చేయడానికి ఆయా శాఖల నుంచి నోట్స్ సీపీవోకు పంపించాలని తెలిపారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. శకటాలు, స్టాళ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు విక్టర్, చందర్, ఆర్‌డీఓ వీణ పాల్గొన్నారు.

చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది

బీబీపేట: మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం బీబీపేట మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వరి కోతలు పూర్తికావడంతో కొనుగోళ్లు ఈసారి 15 రోజులు ముందుగానే పూర్తయ్యాయని తెలిపారు. మండలంలో ఏర్పాటుచేసిన కేంద్రాలలో యాడారం కొనుగోలు కేంద్రం మరోవారం రోజులు తెరిచి ఉంటుందని, మిగితా కేంద్రాల్లో కొనుగోలు పూర్తిఅయ్యాయని తెలిపారు. రైతులు పండించిన చివరిగింజ వరకు కొనుగోలుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామ్మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ భానుప్రియ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులు వ్యాపారంలో రాణించాలి

దోమకొండ: మహిళా సంఘాల సభ్యులు వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని, పాఠశాలలు ప్రారంభానికి ముందే యూనిఫాంలు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం దోమకొండ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న యునిఫాం కుట్టు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు పంపిణీ చేసే యునిఫాంలను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో 72,081 యునిఫాంలకు గాను, 34,428 మంది మగపిల్లలు, 37,653 మంది ఆడపిల్లలకు యూనిఫాం పంపిణీ చేయాలవసి ఉందని తెలిపారు.



కామారెడ్డిలో కురుస్తున్న వర్షం

ముందుగానే పలుకరించిన జల్లులు

- రైతుల్లో చిగురించిన ఆశలు
- జిల్లాలో మోస్తరు వర్షం

కామారెడ్డి టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో గత వారం రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. ప్రతీసారి జూన్ రెండో వారం నుంచి వర్షాలు ప్రారంభం అవుతుండగా ఈ సారి ముందుగానే మే నెల చివరికల్లా వరుణుడు కరుణించాడు. వానాకాలం సీజన్‌లో వేసే పంటలకు ఈ వానలు కలిసి రానుండడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. దీంతో వ్యవసాయ పనులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం గంటన్నరకు పైగా వర్షం కురిసింది. కామారెడ్డితో పాటు మహమ్మద్‌నగర్, భిక్కనూర్, దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, పల్వంచ, రామారెడ్డి తదితర మండలాల్లో వర్షం కురియడంతో వ్యవసాయపనులు ఊపందుకోనున్నాయి.

చిత్తడిగా మారిన పలు ప్రాంతాలు

జిల్లాలోని పలు ప్రాంతాలు వర్షం పడడంతో చిత్తడిగా మారాయి. ఎప్పటిలాగా మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు పలుచోట్ల పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మురికినీరు రోడ్లపై పారడం, రోడ్లపై మడుగులు కట్టడం జరిగింది. వర్షాలు ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

బిచ్కుంద, మే 27(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో రైతులను మోసగించేందుకు నకిలీ విత్తనాలను డీలర్లు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని బిచ్కుంద ఏడీఏ అమినాబి అన్నా రు. మంగళవారం మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాల్లో పోలీసులతో కలిసి వ్యవసాయ అధికారులు తనిఖీ చేపట్టారు. ఎరువుల డీలర్లు, రైతులకు విక్రయించేందుకు నిల్వ చేసిన విత్తనాల బ్యాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వంచే ఆమోదించబడిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. ప్రతీ బ్యాగ్‌కు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. అమాయక రైతులను మోసగించేందుకు నిర్ణీత ధర కంటే అధిక డబ్బులు తీసుకుంటే రైతులు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఎరువుల దుకాణాల్లో రైతులు కొనుగోలు చేసిన ప్రతీ దానికి తప్పనిసరిగా బిల్లులు పొంది వాటిని జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. నష్టపోతే రైతులకు తగిన నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులను మోసగించేందుకు ఏ ఎరువుల డీలర్ అయినా అక్రమాలకు పాల్పడితే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. విచారణ చేపట్టి దుకాణాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో అమర్‌ప్రసాద్, ఎస్ఐ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరోనా వేరియంట్‌పై వైద్య ఆరోగ్యశాఖ అలర్ట్

- ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు రాష్ట్ర అధికారుల పలు సూచనలు
- ఎలాంటి పరిస్థితులైన ఎదుర్కునేందుకు పకడ్బందీ చర్యలు
- ర్యాపిడ్ కిట్లు, బెడ్లు సమకూర్చుకుంటున్న సిబ్బంది
- ప్రతి ఒక్కరూ తగిన నిబంధనలు పాటించాలని వైద్యఆరోగ్యశాఖ సూచన

కామారెడ్డి టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారి మొదటి, రెండో దశల్లో చేసిన బీభత్సం అంతా ఇంత కాదు. ప్రస్తుతం దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కరోనా ఛాయలు కనిపిస్తుండడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సైతం పలు సూచనలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. దీంతో ఇటీవల జిల్లాలోని పీహెచ్‌సీలో విధులు నిర్వహించే సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు వైరస్ లక్షణాలు కనిపిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలు, మందుల పంపిణీపై అవగాహన చేపట్టారు. కరోనా వేరియంట్‌లు ఎన్ని వచ్చినా ప్రజలు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని, బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, శుభ్రతలు పాటించడం లాంటివి చేస్తే కరోనా వైరస్ వ్యాప్తి అంతగా ఉంటుందని వైద్యఆరోగ్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. నిర్లక్ష్యం వహించడం వల్లనే వైరస్ ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతుందని సూచిస్తున్నారు. అయితే ప్రస్తుతం ప్రచారంలో ఉన్న కరోనా ప్రభావం జిల్లాపై లేదని కాని ప్రజలు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుకోకుంటే మరో మారు భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరిస్తున్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అలర్ట్

కోవిడ్-19 ప్రభావంతో వివిధ దశల్లో పంజా విసిరిన కరోనా వైరస్ వల్ల జిల్లాలోని ఎన్నో కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్న సంఘటనలు ఉన్నాయి. కుటుంబ పెద్ద అయిన తండ్రిని.. అల్లారు ముద్దుగా పెంచిన తల్లిని.. కొందరికి ఒకేసారి తల్లి తండ్రిని దూరం చేసి అనాథులుగా మార్చింది. ఇక వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పరిస్థితి చెప్పనక్కరలేదు. రోజుల వ్యవధిలోనే పదుల సంఖ్యలో అంపశయ్యలపైకి తీసుకెళ్లిన సంఘటనలు లేకపోలేదు. అయితే చివరి దశలో వచ్చిన ఒమిక్రాన్ వెరియంట్ వ్యాప్తి ఎక్కువగా అయినా అప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు వ్యాక్సిన్‌లు అందేలా చర్యలు తీసుకోవడం, వైద్య ఆరోగ్యశాఖ ప్రతీ ఒక్కరికి వ్యాక్సిన్‌లను వేయడంతో ప్రజలు వైరస్ భారిన పడిన త్వరగానే కోలుకున్నారు. ప్రస్తుతం మరోమారు కరోనా వైరస్ పలుచోట్ల విజృంభిస్తుందనే ప్రచారం జరగడంతో జిల్లా వైద్యఆరోగ్యశాఖ మరోమారు అలర్ట్ అయింది. ఇప్పటికే జిల్లాలో 22 పీహెచ్‌సీలు, 1 అర్బన్ పీహెచ్‌సీ, 4 బస్తి దవాఖానాల్లోని అధికారులను, సిబ్బందిని అలర్ట్ చేసింది. ఎప్పటికప్పుడు వారి పరిధిలో అనుమానిత కరోనా లక్షణాలు ఏమైన నమోదు అయితే తెలియాజేయాలని, బెడ్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ర్యాపిడ్ కిట్లు, మందులు అందుబాటులో ఉంచేందుకు సిద్ధమవుతున్నారు.



ఇటీవల వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాల్సిందే..

వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాల్సిందేనని వైద్యులు పేర్కొంటున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తతను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లక్షణాలు కనిపించిన వెంటనే ఆయా పీహెచ్‌సీలలో కరోనా పరీక్షలు నిర్వహించుకుని వైద్యుల సూచనలతో తగు చికిత్సలు తీసుకోవాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. పలు దశలలో వచ్చిన కరోనా వైరస్ ప్రభావంలో పిల్లలకు అంతగా లక్షణాలు ఉండకపోయినా చివరి దశలో వచ్చిన వెరియంట్‌తో పిల్లల్లోనూ ఈ వైరస్ ప్రభావం కనిపిస్తూ వచ్చింది. ప్రస్తుతం వస్తున్న వెరియంట్‌లోనూ పిల్లలపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నందున తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, దగ్గు, అతి జ్వరం లాంటివి ఉంటే నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వైద్యులను సంప్రదించాలని పేర్కొంటున్నారు.

ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

- చంద్రశేఖర్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

జిల్లాలో ప్రస్తుతం కరోనా వైరస్ లక్షణాలు ఎక్కడా లేవు. పలుచోట్ల కేసులు నమోదు అవుతుండడంతో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ సూచన మేరకు తాము ఎలాంటి పరిస్థితులైన ఎదుర్కునేందుకు సిద్ధంగా ఉన్నాం. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లోని సిబ్బందిని అప్రమత్తం చేసి అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరిస్తు, సమూహాలలో భౌతికదూరం పాటించాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తు కరోనా లక్షణాలు ఏమైన ఉంటే దగ్గరలోని ఆసుపత్రుల్లో సంప్రదించాలి.

నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ



ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

నవీపేట,మే27(ఆంధ్రజ్యోతి): నవీపేట ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజనా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పలు వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. డెలవరీల సంఖ్య, ఔట్ పేషెంట్ల సంఖ్యను మరింత పెంచాలని కోరారు. ఈ సందర్భంగా ఇన్ పేషెంట్లకు అందించే ఆహారాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్ కిషన్ తదితరులున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధుల మంజూరు



ఎంపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నవీపేట,మే27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లోని గాయత్రి విశ్వబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ 5లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని సంఘం సభ్యులు తెలిపారు. మంగళవారం బీజేపీ మండల అధ్యక్షులు సరిన్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎంపీ 5లక్షల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

రెంజల్,మే27(ఆంధ్రజ్యోతి): పండుగలు మతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ చంద్రమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలోని రైతు వేదికలో పోలీసు, రెవెన్యూ, మెడికల్, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా, విక్రయ యాజమానులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతి శనివారం నిర్వహించే సంతలో అక్రమంగా గోవులను రవాణా చేయరాదని, గోవులను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు మహబూబ్ అలీ, రాజేందర్ రావు, రాఘవేందర్ గౌడ్, సాయిలు తదితరులున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కోటగిరి,మే27(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరు యోగాను అలవాటు చేసుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఆయుర్వేద వైద్య అధికారి రాధిక పేర్కొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆయుష్ శాఖ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా యోగాపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు సతీష్ గౌడ్, జ్యోతి, పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రభుత్వ ఆసు పత్రిలో వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమం కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆశ సూపర్ వైజర్ ప్రిసిల్లా, సూపర్‌వైజర్ అన్నయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

భీమ్‌గల్ రూరల్ , మే27(ఆంధ్రజ్యోతి): భీమగల్ మండలంలోని పురానిపేట్, దేవన్‌పల్లి గ్రామాలలో మంగళవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్న మేస్త్రీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనిచేయాలని పనుల్లో నాణ్యత లోపించకుండా నిర్మించాలన్నారు. మిగత లబ్ధిదారులు పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి జితేందర్, రాజు, కారోబార్‌లు ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షలు అందజేస్తుండగా కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపువెంకటేశ్ డిమాండ్ చేశారు.మంగళవారం ఆర్మూర్‌లో ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వికలాంగులకు రూ.6వేలు, వృద్ధాప్య పెన్షన్ రూ. 4వేలు ఇవ్వాలని అన్నారు. రేషన్ కార్డులు ఇస్తామని హామి ఇచ్చిన ఇప్పటి వరకు రేషన్‌కార్డులు ఇవ్వలేదని వెంటనే రేషన్ కార్డు మంజూరు చేయాలన్నారు. ఈసమావేశంలో డివిజన్ కమిటి సభ్యుడుఎల్లయ్య, గంగాదర్, సాయిలు, సుజాత, కుల్దీప్‌శర్మ, పాల్గొన్నారు.

ఐలాపూర్ శివారులో మహిళ దారుణ హత్య

- అత్యాచారం తర్వాత హత్యచేశారని అనుమానాలు
- బలం చేకూర్చుతున్న మద్యం బాటిల్, గ్లాస్‌లు, నైలాన్ తాడు
- సంఘటన స్థలంలో చిందరవందరగా పడివున్న కూరగాయలు



సంఘటన స్థలంలో చిందరవందరగా కూరగాయలు, సుమలత(ఫైల్)

నందిపేట, మే27(ఆంధ్రజ్యోతి): నందిపేట మండలంలోని ఐలాపూర్ గ్రామ శివారులో ఉన్న అర్గుల్ రాజారాం ఎత్తిపోతల పథకం గ్రావిటీ కెనాల్ సమీపంలో సాద సుమలత(42) అనే మహిళ దారుణ హత్యకు గురైంది. ఆమెను పలువురు అత్యాచారం చేసి హత్య చేసివుండవచ్చనే అనుమానం వ్యక్తం అవుతున్నాయి. సంఘటన స్థలంలో మద్యం బాటిళ్లు, గ్లాస్‌లు, నైలాన్‌తాడు పలు రకాల కూరగాయలు చిందవందరంగా పడివున్నాయి. పూర్తి వివరాలకు వెళ్తే నందిపేట మండలం షాకూర్ గ్రామానికి చెందిన సాద సుమలత వ్యవసాయ కూలీగా పనిచేస్తోంది. సుమలత సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు చౌడమ్మ కొండూర్‌లోని బంధువుల ఇంట్లో జరిగిన శుభాకార్యానికి వెళ్లింది. అక్కడి నుంచి సాయంత్రం 5 గంటల తర్వాత కూరగాయల కోసం నందిపేట సంతకు వెళ్లింది. కూరగాయలు కొనుగోలు చేసి రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో సుమలత కొడుకు సాద సంజయ్ వెతకగా మంగళవారం ఐలాపూర్ శివారులోని గ్రావిడి కెనాల్ సమీపంలో శవమై కన్పించింది. స్థానిక రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. సుమలతకు గుర్తు తెలియని దుండగులు మద్యం తాగి ఆమెకు తాగించి అత్యాచారం చేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే సుమలత మెడకు నైలాన్‌తాడుతో ఉరివేసి హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి కొడుగు సంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిజనిర్ధాణ కోసం ఆమె శవాన్ని పోస్టుమార్టంకు తరలించి అన్ని పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

కుల,మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- పార్టీ బలోపేతానికి అందరు కలిసి పనిచేయాలి
- 2017 నుంచి పార్టీలో ఉన్న వారికే అధ్యక్ష పదవులు
- జిల్లా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

బోధన్‌రూరల్,మే27(ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ అందరికి సంక్షేమ పథకాలు అందుతాయని, స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని మహలక్ష్మి కల్యాణ మండపంలో బోధన్ పట్టణం, మండలం, సాలూర మండల కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మోసం చేస్తూ కాలయాపన చేశారన్నారు. ఇది మంచి సంప్రదాయం కాదని కేసీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తున్నామని అర్హత ఉన్న ఏ ఒక్కరిని వదలకుండా సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. త్వరలోనే బోధన్ పట్టణంతో పాటు నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. స్థానిక సంస్థగత ఎన్నికలలో గెలిచే వారికే టిక్కెట్లు ఇవ్వబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా సంస్థగత ఎన్నికల ఇన్‌చార్జి బల్మూరి వెంకట్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, ఎల్లమయ్య, నాగేశ్వర్ రావు, మందర్నా రవి, గణపతి రెడ్డి, పాషా మొయినోద్దీన్, అల్లె రమేష్, శరత్, ఆదినారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డిలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● క్రమశిక్షణ గల పార్టీ కాంగ్రెస్ పార్టీ

● పార్టీ బలోపేతం కొరకు కార్యకర్తలు సమిష్టి కృషి చేయాలి

క్రమశిక్షణ గల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు కార్యకర్తలు సమిష్టి కృషి చేయాలని నిజామాబాద్ జిల్లా సంస్థగత ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మంగళవారం మహలక్ష్మి కల్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలన్నారు.ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా సైనికుల్లా పనిచేయాలని పేర్కొన్నారు.

● విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కుటుంబానికి 15లక్షల అందజేత

ఇటీవల రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మరణించారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మృతులు ఒడ్డెర గంగారాం, అతని భార్య బాలమణి, కుమారుడు కిషన్ ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు మృతి చెందడం బాధకరమన్నారు. మృతుడి కుటుంబానికి నార్తల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ పంపిణీ ఆఫ్ తెలంగాణ తరపున ఒక్కొక్కరికి 5లక్షల చొప్పున మొత్తం 15లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా మృతుల కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ హైమద్, ఏడీఈ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

● వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, వర్షపు నీరు ఎక్కడ ఆగకుండా చర్యలు చేపట్టాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని 5, 35, 37, 38వార్డులలో ఆయన పర్యటించారు. లోతట్టు ప్రాంతాలలో నీళ్లు ఆగడం వల్ల ప్రజలకు ఇబ్బందులు పడతారని, ప్రజలకు ఎటువంటి అటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్లను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, డీఈ యోగేష్ తదితతరులు పాల్గొన్నారు.

నవీపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో జిల్లాలోని అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రఘుపతిరెడ్డి గార్డెన్స్‌లో జరిగిన నవీపేట, రెంజల్ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాన్ని సైతం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

● కాంగ్రెస్ పార్టీలో యువతకు ప్రాధాన్యత: బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీ

గ్రామస్థాయిలో పని చేసే యువతకు కాంగ్రెస్ పార్టీలో అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మంగళవారం నవీపేటలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో వారు మంచి నాయకులుగా ఎదిగే అవకాశాలు ఉంటాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో 10సంవత్సరాల పాటు తాను కష్టపడి పని చేస్తే కేవలం 31సంవత్సరాల వయసులోనే తనకు పార్టీ ఎమ్మెల్సీగా నియమించిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నగేష్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మొబిన్ ఖాన్, నాగభూషణ్, నవీపేట,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడపల్లి: పార్టీ అభ్యున్నతికి పని చేసిన వారికి ఎల్లప్పుడూ పార్టీ గుర్తు పెట్టుకుని వారి అభివృద్ధికి పాటు పడుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీఒక్కరిని గుర్తు పెట్టుకుని పార్టీ వారికి పదవులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్లా రాంమోహన్, పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు సత్య నారాయణ, బొబ్బిలి శ్రీనివాస్, ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఉపా ధ్యక్షురాలు రజితాయాదవ్, ఆయాగ్రామాల పార్టీగ్రామ అధ్యక్షులు, నాయ కులు శంకర్ నాయుడు, బంజ కామప్ప, తూట్కూర్ రవీందర్ రెడ్డి, కంచరి శ్రీనివాస్, యాసాడ రాజ్ కుమార్ తదితరలు ఉన్నారు.

పంట మార్పిడి పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలి

- వ్యవసాయ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు దినేష్, శ్రీలత

వేల్పూర్ , మే27(ఆంధ్రజ్యోతి): వైవిధ్యకరణ అనేది రైతులు ఒకే తరహా పంటలు సాగుచేయకుండా పంట మార్పిడి పాటిస్తు సుస్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని రుద్రూర్ ప్రాంతీయ వరి పరిశోధన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆకుల దినేష్, శ్రీలత లు రైతులకు సూచించారు. మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో మంగళవారం జరిగిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో వారు మాట్లాడారు. పంట సరళిలో అధిక పోషక విలువలు, అధిక దిగుబడితో పాటు నేల సారాన్ని పెంపొందించే పంటలను చేర్చాలన్నారు. పర్యావరణ సమతుల్యత చేరే వివిధ రకాలైన పప్పు జాతి , నూనే గింజ పంటలను సాగుచేయడం వల్ల నేల పోష్టికత మెరుగుపడుతుందన్నారు. భూమిపై జీవుల మనుగడ సాగించడానికి చెట్లు చాలా అవసరమని అవి మన పర్యావరణ వ్యవస్థలో ముఖ్యమైన భాగమన్నారు. చెట్లు కార్బాన్‌డయాక్సైడ్‌లను గ్రహించడం ద్వారా వాతావరణంలో మార్పుల ప్రభావాన్ని తగ్గిస్తాయన్నారు. చెట్లు గాలిలోని కాలుష్య కారకాలను గ్రహించి గాలిని శుద్ధి చేస్తాయన్నారు. తక్కువ యూరియ వాడి సాగుఖర్చు తగ్గించుకొని భూసార పరీక్షల ఫలితాల ఆధారిత ఎరువుల యాజమాన్యం చేపట్టాలన్నారు. ఈ కార్యక్ర మంలో పీజేటీఎస్ఏయు సలహాకమిటి సభ్యుడు కోటపాటి నర్సింహా నాయుడు, మండల వ్యవసాయాధికారిని శృతి, మండల వెటర్నరి డాక్టర్ సంతోష్‌రెడ్డి, ఏఈవోలు ప్రశాంత్, షబ్బీర్, స్నేహశ్రీ, సాయిరాంరాజ్, స్థానిక గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

● మెండోరలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం

భీమ్‌గల్ రూరల్: భీమ్‌గల్ మండలం మెండోర లో మంగళ వారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రుద్రూర్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేం ద్రం, వ్యవసాయ పాలిటెక్నిక్ శాస్త్ర వేత్తలు డాక్టర్ మంజు భార్గవి, దుర్గా రాణి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ రంగం లో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. రైతులకు పలు అంశాలపై అవగాహన



అంక్సాపూర్‌లో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీలత

కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, ఏవో లావణ్య, ఏఈవో భార్గవ్, ఉద్యానవన శాఖ అధికారి రోహిత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోదిరే స్వామి, డీసీసీ డెలిగేట్ కుంట రమేష్, జేజే నర్సయ్య, అనంత్‌రావు, గ్రామ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కోటగిరి: పంటల సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని రుద్రూరు కేవీకే శాస్త్రవేత్త సాయి చరణ్ సూచించారు. పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో మంగళవారం వరి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సాయిచరణ్ మాట్లాడుతూ అవసరం మేరకే యూరియా వినియోగించి పంట సాగు ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. రైతులు విత్తనాలు, మందులు కొనుగోలు చేసిన తర్వాత బిల్లులను తప్పనిసరి తీసుకోవాలని, పంటకాలం పూర్తయ్యే వరకు వాటిని భద్రపర్చుకోవాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ పేర్లు తప్పనిసరి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రశాంతి, వెటర్నరీ అధికారి నారాయణ, వ్యవసాయ అధికారిణి నిశిత, ఏఈవో సుప్రియ, నాయకులు రామిరెడ్డి, మల్లుగొండ, లింగాప్ప, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డీసీవో



ఇస్సాపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీవో

ఆలూర్, మే27(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని ఇస్సాపల్లి, మచ్చర్ల గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీవో శ్రీనివాస్‌రావు పరిశీలిం చారు.తడిసిన ధాన్యాన్ని పరిశీలించి వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలిం చాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడానికి రైస్‌మిల్లర్లు ముందుకు రావడం లేదని దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నా యని సొసైటీ చైర్మన్ తంబూరి శ్రీనివాస్ డీసీవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్, ఇతర అధికారులు ఉన్నారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు



పచ్చల నడ్కుడలో ముళ్లపొదను, చెత్తచెదారాన్ని తొలగిస్తున్న కార్మికులు

వేల్పూర్, మే27(ఆంధ్రజ్యోతి): వేల్పూర్, పచ్చల నడ్కుడలో మురికి కాలువల నుంచి చెత్త చెదారం, డ్రైనేజీ పై నిండిన ముళ్లపొదలను మంగళవారం ఆయా గ్రామా పంచాయతీ పారిశుధ్య సిబ్బంది తొలగించారు. రోడ్లుపై మురికి కాలువల నుంచి తీసి రోడ్డుపై వేసిన బురద మట్టిని కూడా పారిశుధ్య సిబ్బంది తొలగించే పనులు చేపట్టారు. ఈనెల 27వ తేదీన'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం అనే కథనానికి స్పందించిన జీపీ అధికారులు పారిశుధ్య కార్మికులతో మురికి కాలువల శుభ్రం చేసే పనిని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీవో సాయిలు మాట్లాడుతూ వర్షకాలం సమీపిస్తున్నందున అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించడం జరిగిందన్నారు. చెత్త కుండీల ఏర్పాటు చేయాల్లన్న ఆలోచనతో ఉన్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం చేపట్టిన మురికి కాలువల శుభ్రత పనులను కార్యదర్శులు నవనీత, వినోద్ పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు మురికి కాలువలలో చెత్త చెదారం నిండకుండా శుభ్రం చేస్తూ మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

ముప్కాల్, మే27(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్ స్పెషన్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులకు నిర్మల్ జిల్లా గంజాల్‌కు చెందిన ముదరల్ శంకర్ పట్టుబడగా అతన్ని కోర్టుకు హాజరుపర్చగా ఆర్మూర్ సెకంట్‌క్లాస్ న్యాయాధికారి గట్టు గంగాధర్ రెండు రోజుల పాటు జైలుశిక్ష విధించినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

జాగృతి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం

భీమ్‌గల్,మే27(ఆంధ్రజ్యోతి):వచ్చేనెల 2వ తేదీన ఆవిర్భావ దినోత్సవం పురస్క రించుకుని జాగృతి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సాహిత్య విభాగం జిల్లా కో-కన్వీనర్ కంకనాల తెలిపారు. సాహిత్య రంగంలో యువతను ప్రోత్సహించడానికి తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తున్న కృషి ముందుతరాలకు వెలుగుబాటలు వేస్తుందని ఆయన అన్నారు. తెలం గాణ సమాజంలో కన్పించే సమష్టితత్వాన్ని ప్రతిబింబించేలా యువ కవులు, కవయిత్రీలుసమ్మేళనంలో పాల్గొనాలని అన్నారు.తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూభాషల్లో సామర్థ్యంకలవారు 35ఏళ్లలోపు ఉన్నవారు అర్హులన్నారు.

జన్నేపల్లిలో ఎరువుల డీలర్లతో సమావేశం

నవీపేట,మే27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లిలో మంగళవారం ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. స్థానిక రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో ఏవో నవీన్ కుమార్ మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల దుకాణాలలో స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలని, దుకాణదారులు అన్ని లైసెన్స్‌లు కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎరువులు, విత్తనాల డీలర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మాక్లూర్, మే27(ఆంధ్రజ్యోతి):మండలంలోని అమ్రాద్‌గ్రామానికి చెందిన మంగళవారం జీవమ్మ(78)అనేవృద్ధ మహిళ రోడ్డు ప్రమాదం లో మృతిచెందినట్లు ఎస్సైరాజశేఖర్ తెలిపారు.అంధురాలైన జీవమ్మ మంగళవారం తన ఇంటిముందు పాకుకుంటు రోడ్డు దాటుతుండగా అదే సమయంలో కారు ఢీకొట్టింది.దీంతో తీవ్ర గాయాలైన జీవమ్మను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

ఘనంగా గుమ్మడి ఆశ్రమ వార్షికోత్సవ వేడుకలు

కోటగిరి,మే27(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లో గుమ్మడి ఆశ్రమ 3వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుమ్మడి శ్రీధర్, సుచిత్ర దంపతులకు చెందిన తనయుడు చౌరీస్ రాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గుమ్మడి చౌరీస్ రాజ్ జ్ఞాపకార్థం ఆశ్రమాన్ని నెలకొల్పడంతో పాటు పేద విద్యార్థులకు విద్యభ్యాసాన్ని ఫౌండేషన్ తరఫున అందించడం అభినందనీయమని మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్ పేర్కొన్నారు. విద్యార్థులకు, సిబ్బందికి ఈ సందర్భంగా దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కోటగిరి విండో అధ్యక్షులు కూచి సిద్దు, ఎక్లాస్‌పూర్ మాజీ సర్పంచ్ శ్రీహరి, ఆశ్రమ నిర్వాహకులు మధు, గ్రామ పెద్దలు రంగాబాబు చౌదరి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలు సానిటేషన్ల పరిశీలన

ఆర్మూర్‌టౌన్,మే27(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో సాని టేషన్‌ను మున్సిపల్ కమీషనర్ మంగళవారం పరిశీలించారు. రాబోవు వర్షకాలం దృష్ట్యా డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, ఎన్విరల్‌మెంట్ ఇంజనీర్ పూర్ణమౌళి, సానిటరీ జవాన్‌లు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా వసంత్ రెడ్డి

బోధన్‌రూరల్,మే27(ఆంధ్రజ్యోతి): బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నడ్పి వసంత్ రెడ్డిని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియమించారు. నడ్పి వసంత్ రెడ్డి బోధన్ మార్కెట్ కమిటీలో డైరెక్టర్‌గా ఉన్నారని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్యదాము రాజీనామా చేయడంతో ఆ స్థానంలో వైస్ చైర్మన్‌గా ఉన్న చీల శంకర్‌ను అధ్యక్షుడిగా ఇటీవల ఎమ్మెల్యే నియమించారు. ఉపాధ్యక్షులుగా డైరెక్టర్‌గా ఉన్న నడ్పి వసంత్ రెడ్డిని నియమించడంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బంధువులకు మృతదేహాలను ఇవ్వకుండా కాల్చివేయడం హేయమైన చర్య

ఆర్మూర్ రూరల్, మే27(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ నాయకుల మృత దేహాలను బంధువులకు అప్పగించకుండా పోలీస్‌లే దహనం చేయడం హేయమైన చర్య అని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నిజామాబాద్ రూరల్, కామరెడ్డి జిల్లా కార్యదర్శి వి. ప్రభాకర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, ఇతర తెలుగు రాష్ట్రాల నేతలు ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెంది ఆరురోజులైన బంధువులకు వారి మృతదేహాలను అప్పగించకపోవడం కేంద్ర, రాష్ట్ర బీజేపీ ఏపీ కూ టమి ప్రభుత్వ ఫాసిస్టు దుర్మార్గానికి నిదర్శనమి ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ, డివిజన్ కార్యదర్శి దేవరాం, ఎం. ముత్తెన్న, సురేష్, రాజేశ్వర్, సత్తెక్క, కిషన్, నరేందర్, కిషోర్, అర్వింద్, నికిల్, రాములు పాల్గొన్నారు.

నందిపేటలో నెహ్రూ వర్ధంతి

నందిపేట , మే27(ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో భారతదేశ తొలిప్రధాని పండిత్ జవహర్‌లాల్‌నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ స్వతంత్ర సమర యోధుడని స్వాతంత్ర ఉద్యమానికి విరాళాలు అందజేసిన కుటుంబం నెహ్రూదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, సీనియర్ నాయకులు పిప్పెర సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సిలెండర్ లింగం, దూడ వెంకటేష్, మజారుద్దిన్, నాయకులు మాన్పూర్ భూమేష్, జమీల్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంతో పాటు అశోక్‌నగర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్ ఇట్టెం జీవన్, నాయకులు పూల నర్సయ్య, శ్రావణ్, నటరాజ్, శాల ప్రసాద్,మోసిన్, నదిన్, నారాయణ, భరత్, పాల్గొన్నారు.

పోతంగల్ మండలానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు

కోటగిరి,మే27(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని పొతంగల్ మండలానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పొతంగల్ మండలంలోని పీఎస్ఆర్ నగర్ గ్రామంలో 200కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన సముదాయం నిర్మించేందుకు ప్రభుత్వ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. బాన్సువాడ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేయించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యవసాయ సలహదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సోంపూర్ శివారులో ఇటీవల అధికారులు సర్వే నిర్వహించి 20ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని గుర్తించారు. బాన్సువాడ భవన సముదాయానికి సరిపడ స్థలం ఉండడంతో పాటు కొత్తగా ఏర్పడిన పొతంగల్ మండలంలో పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బాన్సువాడలో..

బాన్సువాడటౌన్: బాన్సువాడ నియోజకవర్గానికి 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైనట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోతంగల్ మండలం పీఎస్ఆర్ నగర్ గ్రామం సోంపూర్ శివారులో నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటిగ్రేటెట్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

తండ్రిని హత్య చేసిన నిందితుడి రిమాండ్

లింగంపేట,మే 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అయ్యపల్లితండాలో శనివారం తండ్రిని హత్య చేసిన కొడుకు ప్రకాశ్‌నాయక్‌ను పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. తండ్రి రెండో పెళ్లి చేసుకుంటానని ప్రయత్నించడంతో తండ్రి కొడుకుల మధ్య జరిగిన ఘర్షణలో కొడుకు ప్రకాశ్ నాయక్ ఆవేశంతో తండ్రి తలపై గొడ్డలితో కొట్టడంతో తండ్రి మృతి చెందాడని సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. విచా రణ జరిపిన పోలీసులు ప్రకాశ్ నాయక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏఎస్సై ప్రకాశ్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.


రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

సంతలో సమస్యల తిష్ఠ

- ఇరుకు స్థలంలోనే మద్నూర్ సంత
- రోడ్డు మీదే కూరగాయల విక్రయాలు
- మౌలిక వసతులు కల్పించని స్థానిక అధికారులు

మద్నూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే సంత అనేక సమస్యలకు నిలవుగా మారడంతో ప్రజలు సతమ తమవుతున్నారు. పేరుకే మండల కేంద్రమైన సంతకు తగ్గట్టుగా విశాలమైన స్థలం లేకపోవడంతో గ్రామం నడిబొడ్డున ఉన్న గాంధీ చౌక్ నుంచి బస్టాండ్ వరకు ఇరుకు రహదారిపైనే సంతా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలోని 36 గ్రామాల నుంచి ప్రజలు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. సంత రోజు గాంధీ చౌక్ నుంచి బస్టాండ్ వరకు ఇరువైపులా వ్యాపారులు కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయడంతో కేవలం ఐదు ఫీట్ల రోడ్డు మాత్రమే ఉంటుంది. వేలాదిమంది సంతకు రావడంతో రోడ్డు ఇరుకుగా మారిపోతోంది. దీంతో ఒకరికి ఒకరు తోసుకొంటూ రావాలసిన పరిస్థితి ఏర్పడుతోంది. సంత రోజు ఏవైనా వాహనాలు బస్టాండ్ నుంచి గ్రామంలోకి రావాలంటే వెళ్లడానికి సైతం ఇదే దారి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంత రోజు గ్రామంలోకి వెళ్లడానికి ఎటువంటి వాహనానికి దారి ఉండటం లేదు .ఇరుకు టసంతతో గ్రామాల నుంచి వారాంతపు సంతకు వచ్చే వారికి ఇరుకు సంతలో ఇబ్బందులు మరిన్ని పెరిగాయి. అదేవిధంగా సంతకు వచ్చే ప్రజల కోసం మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల నుంచి సంతకు వచ్చే మహిళలకు మూత్రశాలలు లేకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. అదేవిధంగా తాగునీటితో పాటు సంతలో ఐమాస్ట్ లైట్లు లేకపోవడంతో అటు కొనుగోలుదారులకు ఇటు విక్రయదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జాతీయ రహదారి ఆనుకొని సంత ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. సంత రోడ్డుకు కాకుండా లోపలికి విశాలమైన స్థలంలోకి మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. మహిళలు మూత్రశాలలు లేక గ్రామానికి చివర్లో పంట భూములోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీకి తై బజార్ రూపంలో లక్షల్లో ఆదాయం ఉన్నాప్రజల సౌకర్యార్థం మూత్రశాలలు, తాగునీటి కల్పించలేకపోతున్నారు. దీనిపై స్థానిక నాయకులు స్పందించి మహిళలకు మూత్రశాలలైన ఏర్పాటు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నార్సింగ్‌పల్లిలో కాసిన మే పుష్పలు ఇలా..

కనువిందు చేస్తున్న మే పుష్పం

సిరికొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్సింగ్‌పల్లి గ్రామంలో ఓ రిటైర్డ్ టీచర్ ఇంటి ఆవరణలో పెరిగిన మే పుష్పాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. నార్సింగ్‌పల్లి గ్రామంలో రిటైర్డ్ టీచర్ కాయిత సొలమన్ ఇంటి వద్ద నాటిన మే పుష్పం మొక్కకు పూసిన పుష్పాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వివిధ దశల్లో పుష్పం పూచే విధానాన్ని చూసిన పలువురు ఆశ్చర్యానికి గురువుతున్నారు. పూలు కాసే సమయం కోసం ఏడాదంతా ఎదిరి చూడాల్సి వస్తుందని రిటైర్డ్ టీచర్ కాయిత సోలమన్ పేర్కొన్నారు.

సోంపూర్‌లో జింక పిల్లపై వీధి కుక్కల దాడి

కోటగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామంలో జింక పిల్లపై మంగళవారం వీధి కుక్కలు దాడి చేశాయి. కుక్కలు జింక పిల్లను వెంబడించడాన్ని చూసిన స్థానికులు వీధికుక్కలను తరిమివేశారు. జింక పిల్లను గ్రామంలోకి తీసుకొచ్చి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. జింక పిల్లకు పశువైద్య కేంద్రంలో వైద్య చికిత్స అందించి వర్ని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టి ఫారెస్ట్ సెక్షన్ అధికారి సురేష్ తెలిపారు.

రోడ్డు పక్కనే వ్యర్థాలు!

- కంపుకొడుతున్న గ్రామ సరిహద్దులు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
- గడికోట పక్కనే కంపుకొడుతున్న వైనం
- అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు

దోమకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): దోమకొండ శివారు రోడ్లపై ఎటు చేసినా చికెన్ వ్యర్థాలు, ఇతర దుకాణదారుల చెత్తే దర్శనమిస్తోంది. ఆ ప్రాంతమంతా కండు కొడుతోంది. ఈ విషయం తెలిసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

పాత తాలుకా అయిన దోమకొండ మండల కేంద్రానికి పలువురు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా ప్రతీ సోమవారం వారంతపు సంత ఉండటంతో భిక్కనూర్ మండలంలోని లక్ష్మీదేవునిపల్లి, అంతంపల్లి, గుర్జకుంట, ర్యాగట్లపల్లి, రామాయంపేట మండలం నుంచి ఆయా గ్రామాల రైతులు, వ్యాపారులు కూరగాయలు విక్రయించుకునేందుకు దోమకొండకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. దోమకొండ గడికోట వందల ఏళ్ల చరిత్ర కలిగి ఉంది. కోటకు దేశవ్యాప్తంగా పేరుంది. అంతటి పేరున్న కోట పక్కనే చెత్తాచెదారం నిండి ఉండటంతో కోటకు వచ్చే పర్యాటకులు సైతం ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి నెలకోంది.

గొట్టిముక్కుల ప్రజలకు ఇబ్బందులు

దోమకొండ నుంచి గొట్టిముక్కుల 3కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఆ గ్రామంలో 350 కుటుంబాలు నివసిస్తున్నాయి. కానీ అక్కడ ఎలాంటి వసతులు లేకపోవడంతో ప్రతీ చిన్నపనికి ప్రజలు దోమకొండకు వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. అయితే దోమకొండ కోట పక్కనే ఉన్న కుడిచెరువు వద్ద రోడ్డు పక్కనే కొందరు వ్యక్తులు చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వస్తోందని గ్రామస్థులు చెప్తున్నారు.

కుక్కల స్వైరవిహారం

రోడ్డుపక్కనే చికెన్ వ్యర్థాలు, ఇతరాత్ర దుకాణదారులు చెత్తను వేయడంతో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ద్వీచక్ర వాహనాలపై వెళ్లే వారు కుక్కలు అడ్డురావడంతో గాయాల పాలవుతున్నారు.

• ఉన్నాతాధికారులు అటునుంచి వెళ్లిన చెత్తపై పట్టింపేలేదు

గతంలో గొట్టిముక్కుల రోడ్డు నుంచి దోమకొండకు కలెక్టర్ అటుగా వెళ్లినప్పుడు చెత్త కుప్పలను, అక్కడి పరిసరాలను పరిశీలించారని, అయినా చర్యలు చేపట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నాతాధికారులు సైతం పట్టింపు లేకుండా వెళ్లితే ఇక తమ గోడును ఎవరికి చెప్పుకోవాలని గొట్టిముక్కుల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే చెత్తఉన్న కనీసం చెత్త విషయంలో అధికారులకు ఆదేశాలు జారీ చేయకుండా వెళ్లడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.


గొట్టిముక్కుల రోడ్డు పక్కనే వేసిన వ్యర్థాలు


చెత్త కుప్పల గుండా వెళ్తున్న అధికారుల వాహనాలు

పెద్దఎత్తున రాకపోకలు

భిక్కనూర్ మండలంలోని టోల్‌గెట్ వద్ద నూతన కాంట్రాక్టర్ వచ్చిన తర్వాత అక్కడ లోకల్ వాహనాలకు అనుమతి ఇవ్వడం లేదని టోల్ గేట్ రుసుము తప్పించుకునేందకు ఎక్కువ వాహనాలు ఈ రోడ్డు గుండానే వెళ్తున్నాయి. దోమకొండ, మాచారెడ్డి, సిరికొండ, బీబీపేట, గంబీరావ్‌పేట, ఎల్లారెట్టిపేట మండలాలకు వెళ్లే కార్లు, లారీలు, టిప్పర్‌లు ఎక్కువగా వెళ్లడంతో కుడి చెరువు చెత్త వేసిన చోట కుక్కలు ఉండటంతో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికే కొందరు బైక్‌లపై నుంచి కిందపడి కాళ్లు, చేతులు విరిగి ఆసుపత్రి పాలై సంఘటనలు చాలా ఉన్నాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి

• నత్తి రాజమౌళి, గొట్టిముక్కుల



దోమకొండ నుంచి గొట్టిముక్కుల గ్రామం వెళ్లేదారిలో చెత్తను వేయడంతో ఆ ప్రాంతం కంపు కొడుతోంది. అధికారులు స్పందించి అక్కడ చెత్త వేయకుండా చూడాలి. గడికోటకు చాల మంది పర్యాటకులు ఈ దారి గుండానే హైదరాబాద్ నుంచి వస్తువెళ్తుంటారు. కుక్కలు అక్కడ స్వైరవీహారం చేయడంతో ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాల పాలవుతున్నారు. అధికారులు వెంటనే చెత్తను తొలగించి, చెత్త వేయకుండా ఆదేశాలు జారీ చేసి వేసిన వారికి జరిమాన విధించాలని కోరుతున్నాం.

నిరుపయోగంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

- డబుల్ ఇళ్లలోని వస్తువులు, విద్యుత్, ప్లంబింగ్ సామాన్లు చోరీకి గురవుతున్న వైనం
- ఇళ్లు అప్పగించకపోవడంతో ఆందోళనలకు దిగుతున్న లబ్ధిదారులు


ఇళ్లలో తాగి పారేసిన బీరుసీసాలు


ధ్వంసమైన కిటికీలు


గోడలకు పగుళ్లు ఏర్పడ్డ దృశ్యం

భిక్కనూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని జాతీయరహదారి పక్కన నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. ఈ డబుల్ బెడ్‌రూం ఇళ్లను బీఆర్ఎస్ హయాంలో నిర్మించగా ఆ ప్రభుత్వంలోనే ప్రత్యేక గ్రామసభలను ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే మండలంలో మిగితా గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయగా భిక్కనూరు పట్టణంలో మాత్రం ఇప్పటికీ లబ్ధిదారులకు అప్పగించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా నేటికీ వీటి గురించి పట్టించుకోవడం లేదని, అసలు వీటిని పంపిణీ చేస్తారా చేయరా అని డబుల్ బెడ్ రూం లబ్ధిదారుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. చాలారోజుల కిందంటే పూర్తి అయిన ఈ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పటివరకు పంపిణీ చేయకపోవడంతో చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు మొలకెత్తడంతో పాటుగా మందుబాబులకు అడ్డాలుగా మారి అధ్వానంగా మారాయని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు వీటిని బాగుచేయించి అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

చోరీకి గురవుతున్న వస్తుసామగ్రి

చాలారోజుల క్రితమే భిక్కనూరులో పూర్తి అయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయకపోవడం, ఈ ఇళ్ల వద్ద ఎలాంటి సెక్యూరిటీ లేక వాటిలోని పలురకాల సమాన్లు చోరీకి గురయ్యాయి. చాలా గదుల్లో పైపులు, నల్లాలు, సింక్‌లు, విద్యుత్‌కు సంబంధించి ఎంతో విలువైనా వైర్లు, స్విచ్‌లు, బోర్డులు, హోల్డర్లు, బాత్‌రూం డోర్లు, కిటికీలను, ఈ డబుల్‌బెడ్ రూం ఇళ్లకు వేయ్యగా మిగిలిన కలర్లు, కలర్లు వేయ్యడానికి ఉపయోగించే వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. మరికొన్ని గదుల్లో కిటికీలు, డోర్లు, సింక్‌లు, ప్లంబింగ్, విద్యుత్ సామానును ధ్వంసం చేయగా కొన్ని గదుల్లో పగుళ్లు వచ్చిప్లోరింగ్ కుంగడం వంటివి జరుగుతున్నాయి. గతంలో వీటి చుట్టూ పెద్దచెట్లు, పిచ్చిమొక్కలు మొలకెత్తగాఇటీవల గ్రామపంచాయతీ సిబ్బంది వాటిని తొలగించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా..

ఈ డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద ఎలాంటి కాపలా లేక పలువురు వాటిని అసాంఘిక కార్యకలపాలకు అడ్డాలుగా మార్చుకుంటున్నారు. ముఖ్యంగా పేకాట, మద్యం సిట్టింగులు ఈ డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో నిత్యకృత్యమయ్యాయి. ఈ డబుల్‌బెడ్‌రూం గదుల్లో ఎక్కడ చూసిన మందుసీసాలు, సిగరేట్, పేకాట డబ్బాలు దర్శనమిస్తున్నాయి. వీటికి వెంటనే అధికారులు మరమ్మతులు చేయించి గ్రామ సభలో ఎంపిక చేసి అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆందోళనలు చేస్తున్న లబ్ధిదారులు

గతంలో గ్రామసభ ద్వారా తమను గుర్తించారని, నేటికీ తమకు ఇళ్లను ఎందుకు కేటాయించలేదో తమకు అర్థంకావడం లేదని లబ్ధిదారులు ఆందోళనకు దిగుతున్నారు. ఇటీవల తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేసి వినతి పత్రాలను అందజేశారు. మరికొందరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణీ కార్యక్రమంలో పలుమార్లు వినతి పత్రాలను అందజేశారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డబుల్‌బెడ్ రూం ఇళ్లకు మరమతులు చేయించి అందజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సిద్దాపూర్ రిజర్వాయర్ పూర్తి చేయిస్తా

- పూర్తయితే 14వేల ఎకరాలకు పుష్కలంగా నీరు
- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): సిద్దాపూర్ రిజర్వాయర్ పూర్తి చేయడమే తన ఆశయమని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. సిద్దాపూర్ రిజర్వాయర్ 258 కోట్లతో 1టీఎంసీ కెపాసిటీతో నిర్మించడం జరుగుతోందని, పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. రిజర్వాయర్ పనులు పూర్తయితే 14వేల ఎకరాల మెట్టభూములకు పుష్కలంగా నీరు అందుతుందని, రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు ఎరువులు, పచ్చిరొట్ట అందుబాటులో ఉంచాలని, ఎరువుల కొరత రానివ్వొద్దని అధికారులకు సూచించారు. అనంతరం బాన్సువాడ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనుల విషయంలో ఆర్‌అండ్‌బి సీఈ రాజేశ్వర్‌తో సమీక్షా సమీవేశంలో మాట్లాడారు. కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ భూలక్ష్మీ, అధికారులు, కాంట్రాక్టర్లున్నారు.

ఘనంగా శ్రీ చౌడేశ్వరి దేవి కల్యాణోత్సవం

కోటగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో దేవాంగ కులస్థుల ఆరాధ్య దైవమైన శ్రీ చౌడేశ్వరి మాత కల్యాణోత్సవ వేడుకను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో దేవాంగ సంఘం నాయకులు శ్యాం సుందర్, గణేష్, నాగరాజు, శ్రీనివాస్, బాలరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణ వేడుకను నిర్వహిస్తున్న దృశ్యం

పనులు ప్రారంభించేదెన్నడో?

- టెండర్లు ఖరారైనా మొదలు కాని కల్వర్టు పనులు
- నిధులు రావని వెనకడుగు వేస్తున్న కాంట్రాక్టర్!

కమ్మర్‌పల్లి, మే27 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి నుంచి ఉప్లూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఇందిరమ్మ వరద కాల్వ వద్ద కాల్వర్లు పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ఆ ప్రాంతంలో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రజలు ఈ రహదారి గుండా ప్రతీ శుక్రవారం పవిత్ర గోవదారి పుణ్యక్షేత్రంతో పాటు ఏర్గట్ల మీదుగా వర్షాకొండా, గుమ్మిర్యాల్, గోదావరికి వెళ్తుంటారు. గత 6 సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు కల్వర్‌వద్ద గండి పడగా అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తూ చేతులు దులుపుకుంటూ వస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందుకు 27 సెప్టెంబరు 2023న (అప్పటి రోడ్లు భవనాలశాఖ మంత్రి) ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కల్వర్టు పనుల నిమిత్తం ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా 50లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ పనులకు శంకుస్థాపన సైతం చేశారు. కానీ సదరు కాంట్రాక్టర్ పనులు నేటికీ ప్రారంభించలేదు.

బైపాస్ ఏర్పాటు చేస్తే తప్ప పనులు సాగవు

కల్వర్టు నిర్మాణ సమయంలో ఇందిరమ్మ వరద కాల్వ నుంచి చివరి వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగితే తప్ప కల్వర్టు పనులు చేపట్టడం సాధ్యం కాదని గ్రామస్థులు చెప్తున్నారు. అయితే బైపాస్ రోడ్డు వేయాలంటే రైతులు వేసుకున్న పంటలు లేని సమయంలో సాధ్యమవుతుంది. కానీ రైతులు ఎప్పటికప్పుడు పంటలు వేస్తూనే ఉండడంతో ఈ పనులు చేపట్టే అవకాశం లేకుండా పోతోంది. పంటల కోతలు అవుతున్నా కల్వర్టు నిర్మాణా పనులు మాత్రం ఎక్కడి గొంగళి అక్కడే మాదిరి మారింది. ప్రతీసారి భారీ వర్షాలు కురవడం కల్వర్టు వద్ద గుంత ఏర్పడడం గతకొన్ని సంవత్సరాలుగా జరుగుతూ వస్తోంది. ఇటీవల రహదారిపై గుంత కనిపించకపోవడంతో ఇటీవ రాత్రి సమయంలో ఒక కారు గుంతలో పడిపోయింది. రహదారి గుండా వెళ్తున్నవారు కారు అద్దాలు పగులగొట్టి అందులో ఉన్నవారిని బయటికి తీసి కాపాడారు. వర్షం కురిసిన ప్రతీసారి తాత్కాలింగా మొరం వేసి గుంతను పుడుస్తూ చేతులు దులుపుకుంటున్నారు తప్ప నిర్మాణ పనుల చేపట్టడం లేదనే విమర్శలున్నాయి.

ఈసారి కూడా నిర్మాణం లేనట్టేనా..?

గత యాసంగిలో రైతులు వేసుకున్న పంటల కోతలు పూర్తయినా పనులు చేపట్టేందుకు కావలసిన బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అయితే మరో వారం పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించి వర్షకాలం ప్రారంభమవుతుండడంతో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు సాధ్యం అయ్యే పరిస్థితి లేదు. దీంతో ఈ సారికూడా కల్వర్టు పనులు జరుగవన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పనులు చేపట్టేందుకు కాంట్రక్టర్ వెనకడుగు

గత ప్రభుత్వ హయాంలో టెండర్లు ఖరారైనా కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఇదివరకు పనులు చేసిన బిల్లులు రాకపోవడంతో గతంలో మంజూరైన చాలా పనులు ప్రారంభానికి నోచుకోవడంలేదు అందులో కమ్మర్‌పల్లి ఉప్లూర్ గ్రామాల మధ్య గల కల్వర్టు ఒకటి. ఈ నిర్మాణ పనులకు టెండర్లు ఖరురైనా పనులు చేయడానికి కాంట్రక్టర్ ముందుకు రాకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదనే చెప్పాలి. బిల్లులు రావనే భయంతో కాంట్రాక్టర్ టెండర్‌ను రద్దు చేసుకునేందుకు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత పాలకులు ఈ కల్వర్టు నిర్మాణ పనులపై దృష్టిపెట్టి పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఇటీవల కురిసిన వర్షాలకు మొరం కొట్టుకుపోయి ఏర్పడిన గుంత ఇదే..


అప్పటి మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

పనులు ప్రారంభించి వెంటనే పూర్తయ్యేలా చూడాలి

• చింతకుంట శ్రీనివాస్ ఉప్లూర్



కమ్మమర్‌పల్లి వరద కాల్వ వద్ద ఉప్లూర్ వెళ్లే దారిలో ప్రమాదకరంగా మారిన కల్వర్టు మరమ్మతు పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తయ్యేలా చూడాలి. కమ్మర్‌పల్లి నుంచి ఉప్లూర్ గ్రామానికి ఉదయం నుంచి అర్థరాత్రి వరకు వందల సంఖ్యలో వాహనాలు ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. కల్వర్టు గుంత వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పనులకు టెండర్లు ఖరారైనప్పటికీ ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పనులు పూర్తి అయ్యేలా చూడాలి.

గ్రంథాలయానికి ఫ్రిడ్జ్ వితరణ



గ్రంథాలయానికి ఫ్రిడ్జ్ అందజేస్తున్న దృశ్యం

తాడ్వాయి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తాడ్వాయి గ్రంథాలయానికి గ్రంథాలయ సంస్థల చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి కూలింగ్ ఫ్రిడ్జ్‌ను వితరణ చేసినట్లు ఇన్‌చార్జి గ్రంధ పాలకుడు నర్సింలు తెలిపారు. దాతల సహకారంతో వచ్చిన కూలింగ్ ఫ్రిడ్జ్‌ను గ్రంథాలయానికి అందజేసినట్లు వారు తెలిపారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు చల్లని తాగునీరు అందించాలని ఉద్దేశంతో అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపూరావు, కల్పన, గ్రంధ పాఠకులు తదితరులు ఉన్నారు.

ఒకేదేశం-ఒకే ఎన్నికపై పార్టీల దుష్ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న అవనికాంత్ పాండే

కామారెడ్డిటౌన్,మే 27(ఆంధ్రజ్యోతి):ఒకే దేశం- ఒకే ఎన్నికపై కొన్ని పార్టీలు కావాలని దుష్ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఒకేదేశం- ఒకే ఎన్నిక తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ అవనికాంత్ పాండే అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీకళాశాలలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేదేశం-ఒకే ఎన్నిక అంశంపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవిద్ ఆధ్వర్యంలో అన్నివర్గాల మేధావులు,ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం జరుగుతుందని తెలిపారు. అయినప్పటికి ఈ అంశంపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కోసం గ్రామగ్రామన చర్చపెట్టాల్సిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. దేశానికి ఉపయోగపడే ఎలాంటి మార్పులు అయిన చేయడానికి సిద్ధమని తెలిపారు. ప్రజలపై ఎన్నికల భారం పడకూడదని ఎన్నికలు అభివృద్ధి, ఆటంకం కాకూడదని ఇలాంటి చట్టాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ లింగారావు, బీజేపీ రాష్ట్రకార్యవర్గసభ్యులు రంజిత్‌మోహన్, జిల్లా ప్రధానకార్యదర్శి రవీందర్‌రావు, కామారెడ్డిఅసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, నాయకులు వేణు, సంతోష్, రవీందర్,లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

బిచ్కుంద, మే 27(ఆంధ్రజ్యోతి):ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మంజీర నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకు న్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మంజీర నుండి అక్ర మంగా ట్రాక్టర్‌లలో ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు కాపుకాచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని మంజీర పరివాహక ప్రాంతాల నుంచి ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే వెంటనే 9491036923కి సంప్రదించాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాల ను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

అసంపూర్తిగా వేసిన రోడ్డు పూర్తిచేయాలి



రోడ్డును పరిశీలిస్తున్న కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

భిక్కనూరు, మే 27(ఆంధ్రజ్యోతి): దోమకొండ నుండి భిక్కనూరు మండల కేంద్రం వరకు వేయాల్సిన రోడ్డును పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దోమకొండ నుండి లక్ష్మీదేవుని పల్లి మీదుగా వేసిన బీటీరోడ్డు పూర్తి చేయలేదని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా సగం వరకే ఈ రోడ్డును నిలిపివేశారని అన్నారు. దింతో ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా అధికారులు చర్యలు తీసుకుని ఈ బీటీ రోడ్డును భిక్కనూరు బస్టాండ్ వరకు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగిసిన అహల్యభాయి హోల్కర్ జయంతి



మాట్లాడుతున్న అఖిల భారత సమరసత కళాప్రముఖ్ అప్పాల ప్రసాద్

కామారెడ్డిటౌన్,మే 27(ఆంధ్రజ్యోతి):లోకమాత అహల్యభాయి హోల్కర్ త్రీ శతాబ్ధి జయంతి ముగింపు ఉత్సవాలను జిల్లా కేంద్రంలోని దేవివిహార్‌లో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత సమరసతకళాప్రముఖ్,సమరసత రాష్ట్రకన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ కుటుంబాలు కనపడవని ఒక భారతదేశంలోనే కుటుంబ వ్యవస్థ కనపడుతుందని తెలిపారు. మూడు వందల సంవత్సరాల క్రితం మహిళ సాధికారత కోసం పనిచేసిన లోకమాత అహల్యభాయి హోల్కర్‌నీ ఆదర్శంగా తీసుకుని మహిళలు అందరూ అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు. కుటుంబంలో స్త్రీ సమర్ధురాలుగా ఉంటే ఇంట్లోని వారందరూ సమర్ధులుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాసంయోజక్ బాలరాజ్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు అమృత రాజేందర్, గౌరవ అధ్యక్షుడు తుమ్మరాంచంద్రం, మహిళ కన్వీనర్ అమృతరవళి, సహాకన్వీనర్ వజీర్ సుష్మా, క్రిష్ణమూర్తి, బాలకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, నాగభూషణం, రవీందర్‌నాయక్, బాలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో దొంగతనాల నివారణకు కృషి చేస్తాం

● జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

పెద్ద కొడప్‌గల్, మే 27 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో రానున్న రోజుల్లో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక దళాలు ఏర్పాటు చేసి దొంగతనాల నివారణకు కృషి చేస్తామని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. మంగళవారం పెద్దకొడప్‌గల్ పోలీస్ స్టేషన్‌కు సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వార్షిక తనిఖీలో భాగంగా ఈ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించడం జరిగిందని గత సంవత్సర కాలానికి సంబంధించిన రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగిందని తెలిపారు. దీంతో పాటుగానే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన క్రైం వివరాలు పరిశీలించామని తెలిపారు. ఇక జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం జిల్లా పరిధిలో అన్ని దొంగతనాలు కలిపి 760 కాగా రానున్న సంవత్సరానికి గాను వాటిని తగ్గించుకునేందుకు కృషిచేస్తామని తెలిపారు. ఇక మేజర్ దొంగతనాలు 150 వాటిలో 82 కేసులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఇక 161వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హైవే అథారిటీ వారితో మాట్లాడి త్వరలో స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. దీంతో పాటుగానే చౌరస్తాల దగ్గర వాహనాల వేగం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కాకుండా పెట్రోలింగ్ పెంచడం పాటు విద్యుత్ శాఖ అధికారుల సహాయంతో గస్తీ ముమ్మురం చేస్తామని తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా మేజర్ దొంగతనాలకు పాల్పడేవారిపై పిడి యాక్ట్ నమోదు చేసే ఆలోచన ఉందని తెలిపారు. దీంతో పాటుగానే జిల్లాలో పది, ఇంటర్ పరీక్షలు సజావుగా సాగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, గతంలో మాదిరిగా కాకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు పెంచామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 పోలీస్ స్టేషన్లు ఉండగా 12 పోలీస్ స్టేషన్లు విజిటింగ్ చేయడం జరిగిందని తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులు నిర్భయంగా తమ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది బాధ్యతయుతంగా పనిచేయాలని, డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పదించాలని సిబ్బందికి సూచించారు. ఆయా గ్రామాలలో సీసీ కెమెరాలు బిగింపుపై సంబంధిత ఎస్సైలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్స్‌వాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, బిచ్కుంద సీఐ నరేష్, ఎస్సై మహేందర్‌లు పాల్గొన్నారు.

పలు ట్రాన్స్‌ఫార్మర్లకు వెల్డింగ్

● దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఓపెన్ చేయడానికి వీలు లేకుండా వెల్డింగ్



అచ్చంపేట శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌కు వెల్డింగ్ చేయిస్తున్న అధికారులు

నిజాంసాగర్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలో తరచుగా ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం పోలీసులు ఎలక్ట్రిసిటీ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌ను ఓపెన్ చేయడానికి వీలు లేకుండా వెల్డింగ్ చేయిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో రైతులు పంట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణలో వెల్డింగ్ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్సైశివకుమార్ తెలిపారు.ఈకార్యక్రమంలో లైనింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్‌మెన్ షేరు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి

లింగంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలో వెల్డింగ్ దుకాణంలో పని చేసే మెకానిక్ మహ్మద్ అజీజ్(33) వెల్డింగ్ చేస్తుండగా విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అజీజ్ ఎల్లారెడ్డి నుంచి ప్రతీ రోజు లింగంపేటకు వచ్చి మండల కేంద్రంలోని ఒక వెల్డింగ్ దుకాణంలో పని చేస్తున్నాడు. సోమవారం పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో స్పృహతప్పి పడిపోగా వెంటనే అతనిని ఎల్లారెడ్డిలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగా మృతి చెందినట్లు వారు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య అమ్రీన్ బేగం, కూతురు మదీనా, కుమారులు అజాన్, అజీజ్‌లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సచ్ఛభారత్‌మిషన్ కార్యక్రమానికి నిధులు

దోమకొండ, మే 27(ఆంధ్రజ్యోతి):జిల్లా కలెక్టర్ మార్గదర్శకాల మేరకు స్వచ్ఛభారత్‌మిషన్‌కు నిధులు వచ్చినట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, గడికోట మేనేజర్ బాబ్జీ తెలిపారు. మంగళవారం జీపీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలు నిర్వహణ, యూనిట్‌కి అనుమతి లభించిందన్నారు. ఈ యూనిట్‌కు రూ.43 లక్షల మేర నిధులు మంజూరు అయ్యాయని, అదనంగా ఇంటింటికి వ్యర్థాలను సేకరించే పనిని సులభతరం చేయాడానికి విద్యుత్ సరాఫర, రవాణ సదుపాయాల కోసం రూ. 20 లక్షలు కేటాయించబడ్డాయని తెలిపారు.సమావేశంలో మండల ప్రత్యేక అధికారిణీ జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్,పంచాయతీ కార్యదర్శి యాదగారి, ఏపీఎం రాజు, గణేష్, పాల్గొన్నారు.

తెలంగాణ మలిదశ ఉద్యమకారుల

సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

బాన్సువాడటౌన్ , మే 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా బాన్సువాడకు చెందిన ఉడుత గంగాధర్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం బాన్సువాడ పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఫోరం సభ్యులు ఆయనను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చందు , సాయిబాబా, దేశాయి, శ్యాం, కృష్ణ , మాజిద్ తదితరులున్నారు.

బీర్కూర్ పీహెచ్‌సీలో మహిళా ఆరోగ్య శిబిరం

బీర్కూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 30 ఏళ్ళుపై బడిన మహిళలకు వైద్యాధికారిణి శ్రీలేఖ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్, థైరాయిడ్, గర్భకోశ, మూత్రకోశ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పం పిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గిరీష్, సీహెచ్‌వో రవీందర్, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్ వైజర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ సర్వసభ్యసమావేశం

కామారెడ్డిటౌన్,మే27(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా సర్వసభ్య సమావేశంను బుధవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంతెన సామెల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మాదిగ ఉపకులాలు,విద్యార్థులు,ఎంఆర్‌పీఎస్ నాయకులు,గ్రామాలఅధ్య క్షుడు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలనికోరారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డిటౌన్,మే 27(ఆంధ్రజ్యోతి):యాదవ ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తుచేసుకోవాలని యాదవ సంఘనాయకులు శ్రీనివాస్ యాదవ్, సాయన్నయాదవ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదవ ఎంప్లాయిస్ సోసైటి ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను పది, ఇంటర్ 80శాతం, ఆపై మార్కులు సాధించిన జిల్లా యాదవ విద్యార్థులు ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తుచేసుకోవాలని కోరారు.మిగిలిన వివరాలకు 9441046994, 9505200165 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు

బాన్సువాడటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం నుంచి స్వామి వారి మూలవిరాట్టుకు అభిషేకాలు , అర్చనలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం దాతలు ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం అన్నప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , తదితరులున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

సదాశివనగర్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్కల్ గ్రామానికి చెందిన సింపల్లి సాయవ్వ(42) మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రంజిత్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం సాయవ్వకు గత ఐదు సంవత్సరాల క్రితం నడుముకు దెబ్బ తగిలి ఆపరేషన్ కావడంతో ఆరోగ్యం క్షీణించింది. గత నెలరోజుల క్రితం మరల మోటారు సైకిల్‌పై నుండి పడి చేయి విరగడంతో మంచాల పాలైంది. దీంతో రోజురోజుకు ఆరోగ్యం క్షీణించడంతో జీవితంపై విరక్తి చెంది ఏమిచేయలేకపోతున్నాననే బాధతో ఈ నెల 24న ఇంట్లో గడ్డిమందు తాగగా భర్త ఎల్లారెడ్డిపేట ఆసుపత్రికి తీసుకెళ్లాడని తెలిపారు. అక్కడ వైద్యుల సూచన మేకు నిజామాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

25 మందికి కంటి వైద్య పరీక్షలు

బీర్కూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 25 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఇదిలా ఉండగా ముగ్గురికి కంటి దృష్టి లోపం ఉన్నట్లు వైద్యుడు గుర్తించారు. శస్త్ర చికిత్సల నిమిత్తం వారిని బోధన్ లయన్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు గాలు, సభ్యులుపాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలి

నాగిరెడ్డిపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని తహసిల్దార్ శ్రీనివాస్ రావు లబ్ధిదారులను కోరారు. ఆయన మంగళవారం వదల్పర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ కార్యక్రమంలో పాల్గొని ఇంటి నిర్మాణానికి ముగ్గు వేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అజీముద్దీన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

కేంద్రమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



మంత్రికి వెంకటేశ్వరస్వామి ఫొటో బహూకరిస్తున్న ఎమ్మెల్యే

కామారెడ్డిటౌన్,మే 27(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి నితిన్ గడ్కరి జన్మదినం సందర్భంగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నాగ్‌పూర్‌లో ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తిరుమలతిరుపతి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని ఆయనకు అందించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీధర్, తేలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

భిక్కనూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్‌ల ఛలో హైదరాబాద్ పిలుపు నేపథ్యంలో మంగళవారం ఉదయం భిక్కనూరు మండల బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఇలా అరెస్టులు చేయ్యడం సిగ్గుచేటన్నారు. తమకు రావాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో జనగామ శ్రీనివాస్, కందడి మనోహర రమేష్‌రెడ్డి, లక్ష్మీరాజలింగం, తదితరులు ఉన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి

● ఏడీఏ రత్న



విత్తనాల దుకాణంలో తనిఖీ చేపడుతున్న దృశ్యం

సదాశివనగర్, మే 27(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ ధృవీకరణ పొందిన కంపెనీల నాణ్యమైన విత్తనాలను లైసెన్స్ కలిగిన వ్యాపారుల నుండి మాత్రమే కొనుగోలు చేయాలని ఏడీఏ రత్న అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు అన్ని స్టాక్ రిజిస్టర్‌లో, సూచిక బోర్డుపై ఎప్పటికప్పుడు నమోదు చేసి ఉంచాలని వ్యాపారస్థులకు సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు, ఎరువులకు తప్పకుండా రైతులకు రసీదులను ఇవ్వాలని, దానిపై తప్పకుండా లాట్ నెంబరతో పాటుగా తయారు, గడువు పూర్తి తేదిలను నమోదు చేయాలన్నారు. రైతులు సైతం విత్తనాలను కొనుగోలు చేసే ముందు నాణ్యమై విత్తనాలను ఎంచుకుని కొనుగోలు చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాల రసీదులను భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే రైతులకు అమ్మాలి



సీడ్స్ దుకాణంలో రికార్డునలు పరిశీలిస్తున్న ఏవో శ్రుతి

రాజంపేట,మే 27(ఆంధ్రజ్యోతి):నాణ్యమైన విత్తనాలనే రైతులకు అమ్మా లని, కల్తి విత్తనాలు రైతులకు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని ఏవో శృతి అన్నారు. బుధవారం మండలంలోని పలు విత్తన దుకాణాలను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్లు తెచ్చుకున్న విత్తన స్టాక్‌లను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదుచేసుకోవాలని రైతులకు అమ్మిన విత్తనాల రశీదును తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. రశీదుపై డీలర్ సంత కం, రైతు సంతకం ఉండాలని తెలిపారు.రైతులు లైసెన్స్ ఉన్న షాపులలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలనినైరుతి రుతుపవనాలు ముందు గానే వచ్చే అవకాశం ఉన్న సందర్భంలో రైతులు విత్తనాల కోసం ఉరుకులు, పరుగులు పెడుతూ నాణ్యతలేని విత్తనాలను తీసుకోవద్దని తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తాం



దుర్కిలో ఫర్టిలైజర్ షాప్‌ను తనిఖీ చేస్తున్న ఇంటర్నల్ స్క్వార్డ్ బృందం

నసురుల్లాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): నస్రులాబాద్ మండలంలోని ఆయా గ్రామాలలోని ఫర్టిలైజర్ షాపులలో నకిలీ విత్తనాలు అమ్మితే, దుకా ణదారుల లైసెన్సులు రద్దు చేస్తామని ఇంటర్నల్ స్క్వాడ్ బృందం అధికా రులు అన్నారు. మంగళవారం మండలంలోని దుర్కి గ్రామంలో గల ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్నల్ స్క్వాడ్ బృందం అధికారులు మాట్లాడుతూ రైతులకు విక్రయించే విత్తనాలకు రసీదులు తప్పకుండా ఇవ్వాలన్నారు. అనంతరం దుర్కి సొసైటీని సందర్శించి విత్తనా లు, యూరియా నిలువలను పరిశీలించి, రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలని సహకార సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నల్ స్క్వాడ్ బృందం అధికారులు భవాని, రాజలింగం, నద్ధిమొద్దీన్ ఉన్నారు.

అఖిల పక్ష పార్టీల నాయకుల ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న అఖిల పక్ష పార్టీ నాయకులు

నిజాంసాగర్, మే 27 (ఆంధ్రజ్యోతి):నిజాంసాగర్ ప్రాజెక్టు భూములు కాపాడాలని కోరుకుంటూ మండల కేంద్రంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి నిజాంసాగర్ తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు భూములను ఇతర నియోజక వర్గాలకు కేటా యించకుండా మా భూములు మాకే కావాలి, మా భూ ములను రోఇంచాలి అంటూ డిమాండ్ చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన అచ్చంపేట శివారులోని 680 ఎకరాల భూమి ఉందని, అందులో ప్రస్తుతం జవహర్, నవోదయ, తెలంగాణ, మోడల్ స్కూల్, పల్లె ప్రకృతి వనం, నర్సరీలు కూడా ఉన్నాయని, మిగిలి ఉన్న భూమిని సైతం జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి మాత్రమే కేటాయిం చాలని, నిజాంసాగర్ ప్రాజెక్టు భూములు మా సొంతమని ఇతర నియోజకవర్గాలకు కేటాయిస్తే ఊరుకునేది లేదంటూ అఖిల పక్ష నేతలు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ ఆలోచనను మాను కోవాలని లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నేతలు పటోళ్ళ దుర్గారెడ్డి, మనోహర్, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, రవీందర్‌రెడ్డిలు ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - మిషన్ ఇంపాసిబుల్

ప్రియా 70 - వర్షం

ప్రియా 35 - సింగిల్

బాన్సువాడ

మహేశ్వరి - సింగిల్

వెంకటేశ్వర - నిశ్శబ్ద ప్రేమ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

